# ఇజ్రాయిల్ చర్యలను తిప్పికొట్టాలి

**అమెరికా** సామ్రాజ్యవాదుల వెన్నుదన్నులతో పాలస్తీనా ప్రజలపై నిర్హేతుక విధానాలు రుద్దాలని ఇజ్రాయిల్ ప్రయత్నిస్తూనే ఉంది. 2018 జులై 19న ఇజ్రాయిల్ పార్లమెంట్ ఓచట్టాన్ని రూపొందించింది. దాని ప్రకారం ఇజ్రాయిల్ యూదులకు మాతృభూమి, ఇజ్రాయిల్ స్వయం నిర్ణయాధికారం కలిగి వుంటుంది. ఈ బిల్లుని పార్లమెంటులో నెతన్యాహు ప్రవేశపెట్టాడు. 'ఇజ్రాయిల్ మా రాజ్యం. యూదుల రాజ్యం, అదో చారిత్రాత్మక చట్టం' అని అభివర్ణించాడు. ఇదే విశ్వాసం, జాతీయతను పరిరక్షించేందుకు యూదులకు అధికారం కల్పిస్తుందీ చట్టం. ఇజ్రాయిల్‌కు జెరూసలేం సంపూర్ణ ఏకైక రాజధానిగా ఉంటుంది. పాలస్తీనా ప్రాంతాల్లోని యూదు నివాసాలకు ప్రోత్సాహం కల్పిస్తూ వాటిని జాతీయ సంపదగా ఈ చట్టం గుర్తిస్తుంది.

అయితే ఈ చట్టం అన్ని రాజకీయ పార్టీల విమర్శలకు గురైంది. ఈ బిల్లుని పార్లమెంటులో ప్రవేశపెట్టటానికి ముందు ఇజ్రాయిల్ అధ్యక్షుడు ఓ లేఖలో ఇజ్రాయిల్‌ను యూదుల రాజ్యంగా పేర్కొనటాన్ని ఖండించాడు. ఇది ఇజ్రాయిల్ యూదులకు మాత్రమే చోటు కల్పిస్తుందని, ఇది ప్రపంచంలోని యూదులు అందరికీ హాని చేస్తుందన్నాడు. మధ్య ప్రాచ్యంలోని సనాతన యూదులు, స్వలింగ సంపర్కులను ఇది విస్మరిస్తుందని హెచ్చరించాడు. ఇజ్రాయిల్ పార్లమెంటులోని అరబ్ సభ్యులు కూడా ఈ చట్టాన్ని జాత్యహంకార, విచక్షణా పూరితమైనదిగా పేర్కొన్నారు. ఇజ్రాయిల్ పాలక వర్గాల్లో కొంతమంది ఇది పాలస్తీనీయులు, యూదుల మధ్య మరింత అగాధం ఏర్పరస్తుందని, యూదులను ఏకాకులను చేసి ప్రపంచ ప్రజలతో వైరం పెరుగుతుందని భయపడుతున్నారు. పాలస్తీనా విమోచన సంస్థ సెక్రటరీ జనరల్ ఈ చట్టాన్ని జాత్యహంకార, ప్రమాదకరమైన జాతి వివక్షతను చట్టబద్ధం చేసేదిగా పేర్కొన్నాడు. పాలస్తీనా సమస్య పరిష్కారాన్ని, ఈ చట్టం మరింత చిక్కుల్లో పడేసేదిగా ఉంది. జెరూసలెమ్ సంపూర్ణ, ఏకీకృత రాజధానిగా ప్రకటించటం పాలస్తీనా ప్రజల హక్కులను తోసివేయటమే కాకుండా, పాలస్తీనా రాజధాని సమస్యపై చర్చల ద్వారా పరిష్కారానికి తలుపులు మూసినట్టవుతుంది.

పాలస్తీనా ప్రజల మాతృభూమిని, హక్కులను బలపరచే ప్రపంచ ప్రజలంతా ఈ క్రూర చట్టాలను ప్రతిఘటించాలి. మాతృభూమిలో పరాధీనులైన పాలస్తీనా ప్రజల హక్కులకోసం అందరూ ముక్తకంఠంతో ఈ చట్టాన్ని వ్యతిరేకించాలి.

oooo